RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 268 పేజీలు - 08 ఆదివారం 23 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా

# ఎంచుకోండి

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం
- టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు..అపార అవకాశాలు
- అభివృద్ధి... జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలి
- మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి




**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 22 :** తెలంగాణకు రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... తెలంగాణలోనే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను ఇక్కడే ఊహిద్దాం... ఇక్కడే ఆవిష్కరిద్దాం... ఇక్కడి నుంచే ప్రపంచానికి అందిద్దాం'అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి, పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శనివారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2026'లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు. ÷లంగాణ అభివృద్ధి ప్రస్థానం కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, మిగతా2లో...



# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

**కాంగ్రెస్‌కు నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోం**

**హెచ్చరించిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్**

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 22:** మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని

మిగతా2లో...



## తెలంగాణలో విద్యా,పరిశోధనలకు

# కేంబ్రిడ్జ్ సహకారం

- యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్ చర్చలు
- హైదరాబాద్‌లో విద్యావ్యవస్థ పటిష్టతకు అంగీకారం

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 22 :** తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధులు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు, ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా మిగతా2లో...

## దానం నాగేందర్

# అనర్హత పిటిషన్

- తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు




## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో

# ఓట్లు అడగం

- అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు
- హైదరాబాద్ తరహాలో హౌజింగ్ టవర్స్ నిర్మాణం
- నిజామాబాద్ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**తొలి అక్షరం/నిజామాబాద్,ఆగస్టు 22 :** నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి.. ఆ పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో పర్యటించిన మంత్రి.. నగరంలో హౌసింగ్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న

మిగతా2లో...


# నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

- ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది
- ఉప్పల్ బాధితులతో హరీష్ రావు




## గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతస్తుల భవనం

- ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు




## పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

- ఆధునికత సాంకేతికతపై ప్రదర్శన





**తొలి అక్షరం/హైదరాబాద్, 22 :** నగరంలోని నెక్లెస్ రోడ్‌లో పీపుల్స్ ప్లాజాలో పవర్ ఎగ్జిబిషన్-2026 ఘనంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న

మిగతా2లో...

# 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

- ట్రంప్ సర్కార్ నిర్ణయాన్ని కొట్టివేసిన న్యాయస్థానం



**తొలి అక్షరం/వాషింగ్టన్,ఆగస్టు 22:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను

మిగతా2లో...

## 22ఏ నిషేధిత భూముల పేరిట

# పెద్దఎత్తున అక్రమాలు

భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్



# పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకోండి

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2025-26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్?2047' దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశర చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు. ఈ లక్ష్యసాధన కోసం రాష్టాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే nvF,నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే ఖజఖీఇ, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి...

ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతి ఫలించాలి' అని ఉత్తమ్ స్పష్టం చేశారు.

ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతా లకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలు మూలలా విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబి లిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు.

ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలి టీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు.

---

# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కొండా సురేఖ విషయంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. కొండా సురేఖ వివరణ చదివామని తెలిపారు. కొండా సుస్మిత మాటల వీడియోలను చూశామని చెప్పారు. ముఖ్యమంత్రిపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. మంత్రి సురేఖ వివరణపై మరోసారి సమావేశం కావాలని భావించామన్నారు. క్రమశిక్షణ కమిటీకి మరి కొందరు ఎమ్మెల్యేలు మరిన్ని వివరాలు ఇస్తామన్నారని చెప్పారు. అలాగే, చిన్నారెడ్డి వివరణ లేఖ చదివామని మల్లు రవి అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యల వీడియోలు చూశామని తెలిపారు. చిన్నారెడ్డి విషయంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డితో మాట్లాడతామని అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలకు, మేఘా రెడ్డి ఫిర్యాదుకు చాలా అంతరం ఉందని చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడిన అంశాలు తనకు తెలుసని.. కానీ ఒక ప్రాసెస్ ప్రకారం విచారణ ఉంటుందని మల్లురవి తెలిపారు. ఆయా వ్యక్తులపై తమకు ఎలాంటి అభిప్రాయం ఉండదని చెప్పారు. పార్టీనే తమ మొదటి ప్రాధాన్యం అని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ వివరణ లేఖ తమకు అందిందని మల్లురవి తెలిపారు. తన వ్యాఖ్యలపై కంది శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారని అన్నారు. ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడిని ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేశామని చెప్పారు. కంది శ్రీనివాస్ రెడ్డి అంశాన్ని సైతం మరోసారి కూర్చొని మాట్లాడతామని మల్లురవి పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఓట్లు అడగం

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణం చేపడతామని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 230 రూపాయలకే సిమెంట్ బస్తాఇవ్వడానికి కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు మంతంరి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగింది. పట్టణంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్దిదారులకు మంజూరు అంజేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, మరియు గృహనిర్మాణ అంశాల మీద అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ షాపింగ్ కాంప్లెక్స్ లో గంగస్థాన్ ఫేజ్ 2 భవనానికి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. నిజామాబాద్ జిల్లాలోని వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి మరియు గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు భూమి పూజ చేయడం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలో సంవత్సరానికి 2 లక్షల చొప్పున ఇండ్లు కట్టి ఉంటే పదేండ్లలో 20లక్షల ఇండ్లు పూర్తి అయ్యేవి. కేవలం 60 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసింది. 30వేల ఇండ్లను మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసేసింది. నిజామాబాద్ టౌన్ లో కూడ సుమారు 400 ఇండ్లను అసంపూర్తిగా వదిలేస్తే, ప్రజాప్రభుత్వం వచ్చాక వాటికి నిధులు కేటాయించి నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండేలా యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి, డ్రా పద్దతిలో అర్హులైన పేదలకు ఇండ్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 3 కోట్ల 72 లక్షల 65 వేల చెక్కు అందజేశాము. రాబోయే 20 రోజుల్లో నిజామాబాద్ టౌన్ లో పైలట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణాలు శ్రీకారం చుట్టబోతున్నాం. సొంత జాగలేని అర్హులైన నిరుపేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని అన్నారు. ఇక సిమెంట్ బస్తా ధర 330 వరకు ఉంది. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి అది భారంగా కాకుడదు అనే ఆలోచనతో ప్రజాప్రభుత్వం సిమెంట్ పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి, ఒప్పించి 230 రూపాయలకే సిమెంట్ బస్తా అందించేలా ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు.

# 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్దఎత్తున అక్రమాలు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 22 :** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా?

ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమిషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమిషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధా నం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మె ల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది.

ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు.

---

# పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రదర్శనలో విద్యుత్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతల ను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను ప్రజలకు పరిచయం చేయడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో విద్యుత్ భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

స్మార్ట్ మీటరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునేలా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.

# హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో పేలుడు

### - ఇద్దరు కార్మికుల మృతి..క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలింపు

**తొలి అక్షరం/యాదాద్రి,ఆగస్టు 22):** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ భారీ శబ్దంతో పేలింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమా దంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరా బాద్‌కు తరలించారు.

కంపెనీలోని సి-బ్లాక్‌లో నైట్ షిఫ్ట్‌లో 18 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. రియాక్టర్ వద్ద పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి పెద్దవూర మండలానికి చెందిన చిన్న నాగిరెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన నాగన్న బోయిన నరేష్‌కుమార్ మృతి చెందారు. రియాక్టర్ సమీపంలో పనిచేస్తున్న మరో పది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రియాక్టర్ పేలిన శబ్దం భారీగా వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్‌రెడ్డి, ఎస్సై జగన్ పోలీసు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. చౌటుప్పల్, హయత్‌నగర్ నుంచి ౹÷ర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హెజో లేబొరేటరీస్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత జూలై 16న రసాయన వాయువులు పీల్చడంతో అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లు గ్రామానికి చెందిన ఆలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఘటన జరిగి నెల రోజులు కూడా పూర్తికాకముందే తాజాగా రియాక్టర్ పేలడంతో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం తర్వాత కంపెనీ పరిసరాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ఆవరణలో మురుగునీరు చేరి ఉండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ దుర్వాసన కారణంగా కొందరికి తలతిరగడం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురైనట్లు చెబుతున్నారు.

# 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యూఎస్ డిస్టిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. 75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతుస్తుల భవనం

### - ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గామాలు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 22:** గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే, నాలాను ఆనుకుని 50 గజాల్లో అక్రమంగా ఈ భవనాన్ని నిర్మించారు.

ఈ నిర్మాణం కూలిన పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై శకలాలు పడ్డాయి. భయంతో పక్కనే ఉన్న హాస్టల్లోకి విద్యార్థులు పరుగులు తీశారు.ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ ఎలానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిం దే. క్షేత్రస్థాయిలో టౌన్ ఎలానింగ్ అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రమంగా బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాల నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. అయిన హైడ్రా, సీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణలో విద్యా,పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. ముఖ్యంగా విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించడం, సంయుక్త పరిశోధనలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ప్రతినిధులు కేంబ్రిడ్జ్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంబ్రిడ్జ్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు, పరిశ్రమలు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై కూడా సమావేశంలో వివరించారు. అదేవిధంగా సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. తెలంగాణ యువతలో ఉన్న ప్రతిభను ప్రపంచస్థాయి వేదికలకు తీసుకెళ్లేందుకు కేంబ్రిడ్జ్ సహకారం అందించడంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై కేంబ్రిడ్జ్ విద్యావేత్తలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 22:**నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ం బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కోడై కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ం భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి మీ సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ం నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# దానం నాగేందర్ అనర్హత పిటిషన్

### - తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 22:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# రైతు బంధు బకాయిలు వెంటనే చెల్లించాలి

**• రైతు బంధు, రైతు భీమా, కల్యాణలక్ష్మి పథకాలు కొనసాగించాలి: ఢిల్లీ మాధవరెడ్డి**



**తొలి అక్షరం/చౌటుప్పల్: ఆగష్టు22:** రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో అమలు చేసిన రైతు బంధు, రైతు భీమా, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి డిమాండ్ చేశారు.రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న రైతు బంధు పథకం కింద రెండు విడతలుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని ఆయన తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బకాయి ఉన్న రైతు బంధు నిధులను వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే రైతులకు కుటుంబ భరోసా కల్పిస్తున్న రైతు భీమా, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక చేయూతనిస్తున్న కల్యాణలక్ష్మి పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా కొనసాగించాలని అన్నారు.రైతుల సంక్షేమం, పేద ప్రజల ఆర్థిక భరోసాను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయి నిధులను విడుదల చేయాలని ఢిల్లీ మాధవరెడ్డి డిమాండ్ చేశారు.

# నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 22:** రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టిఎస్ అన్నారు.శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్ల మేర డొంక రహదారిలో నడుచుకుంటూ వెళ్లి నీటి కుంట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి కుంటల నిర్మాణం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, ఆ నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుందని అన్నారు. నీటి నిల్వలు పెరగడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీటి కుంట నిర్మాణం, పనుల పురోగతి, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి, గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

# నిరంతరం విద్యార్థుల చదువు కోసం శ్రమిస్తున్న శ్రీనివాసరెడ్డి

**- రామన్నపేట మండలంలో ఆదర్శ ఉపాధ్యాయునిగా గడ్డం శ్రీనివాస్ రెడ్డి**



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:**రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామంలోప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గడ్డం శ్రీనివాసరెడ్డి గత సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. 2025 -26 విద్యా సంవత్సరంలో గ్రామస్తుల సహకారంతో తల్లిదండ్రుల సహకారంతో గ్రామంలో ఉన్న ప్రజా ప్రతినిధుల సహకారంతో తన తోటి ఉపాధ్యాయుల సహకారంతో గ్రామ యువత సహకారంతో విద్యార్థుల యొక్క చదువుకు నేను హామీ ఇస్తున్న అని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను దాతల సహకారంతో ఏర్పాటు చేయించడం జరిగినది. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో వారికి ఇంగ్లీష్ విద్యా విధానంలో ప్రతిరోజు బోధించడం విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి దాతల సహకారంతో గ్రామంలో ముగ్గురి వాలంటరీ టీచర్లను ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతున్నది. శనివారం రోజు జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థులతో వారి యొక్క స్టడీ విధానాన్ని ప్రత్యక్షంగా తల్లిదండ్రుల విద్యార్థుల సమక్షంలో విద్యార్థులకు ఎలాంటి భయం లేకుండా వారితో అనర్గళంగా తెలుగు మాధ్యమాన్ని ఆంగ్ల మాధ్యమాన్ని క్లాసులవారిగా చదివించడం జరిగినది. విద్యార్థులు చదివే విధానాన్ని ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాసరెడ్డి విద్యార్థుల స్టడీ అవర్స్ పట్ల తీసుకుంటున్న విధానాన్ని తల్లిదండ్రులు అభినందించారు. గత సంవత్సరం 20 లోపు ఉన్న విద్యార్థుల సంఖ్య నేడు 70 వరకు రావడం చాలా అభినందనీయ విషయం. విద్యార్థులకు కల్చరల్ ఆక్టివిటీస్ చక్కని విద్య చక్కని హ్యాండ్ రైటింగ్ గేమ్స్ తో కూడుకున్నటువంటి లెర్నింగ్ స్టడీ అవర్స్ టేబుల్స్ లెర్నింగ్ వారి యొక్క ప్రత్యేక డ్రెస్ కోడ్ చాలా అభినందనీయ విషయమని తల్లిదండ్రులు తెలిపినారు. ఏది ఏమైనా రామన్నపేట మండలంలో ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న పేద విద్యార్థుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న గడ్డం శ్రీనివాస్ రెడ్డికి తల్లిదండ్రులకు సహకారం అందిస్తున్న ప్రజాప్రతినిధులకు వాలంటీర్స్ ని ఏర్పాటు చేసి పాఠశాలకు సహకారం చేస్తున్న దాతలకు గ్రామస్తులు అభినందనలు తెలిపినారు. ఏది ఏమైనా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను దాతల సహకారంతో ఏర్పాటు చేసిన గడ్డం శ్రీనివాసరెడ్డికి గ్రామస్తులు అభినందనలు తెలిపినారు **పేరెంట్ ..రషీద్ వివరణ..**గత విద్యా సంవత్సరంలో తమ పిల్లలని ప్రైవేట్ పాఠశాలకు పంపించడం జరిగింది. నేడు హెడ్మాస్టర్ గడ్డం శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినాము. విద్యార్థుల యొక్క స్టడీ విషయంలో చాలా ఆనందంగా ఉన్నది. **పేరెంట్.. కుమార్ వివరణ..** ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాసరెడ్డి తల్లిదండ్రుల గ్రామస్తుల సహకారంతో స్టడీ కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. స్టడీలో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉండడం అభినందనీయ విషయమని తెలిపినారు.

# ప్రతి బాలబాలికకు భద్రమైన బాల్యాన్ని అందించడం మనందరి బాధ్యత...

**జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు**

**విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడం అత్యంత ఆవశ్యకం**

**గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ పై పాఠశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలి**

**పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను టీచర్లు నిశితంగా గమనించాలి**







**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 22:**ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవల పథకం-2024 క్రింద బాలల సంరక్షణ అధికారుల కోసం ఏర్పాటు చేసిన ఒక రోజు ప్రత్యేక అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, తల్లి కోడి తన రెక్కల కింద పిల్లలను పెట్టుకుని ప్రమాదాల నుండి ఎలా ఆప్యాయంగా కాపాడుకుంటుందో, సమాజంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అదే రీతిలో ప్రేమతో, బాధ్యతతో సంరక్షించాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలపై, తమ ప్రాథమిక హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో చిన్న పిల్లలకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' గురించి సరైన రీతిలో అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలన్నారు. అనవసరపు స్పర్శను గుర్తించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలిపేలా వారిలో ధైర్యాన్ని నింపాలన్నారు.విద్యార్థుల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు (భయం, ఒంటరితనం, ఆందోళన) కనిపిస్తే టీచర్లు వెంటనే గమనించాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్గదర్శకులుగా నిలవాలన్నారు.బాలల సంరక్షణ అధికారులు తమ విధులను కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పిల్లలపై జరుగుతున్న వేధింపులపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలన్నారు. "మొక్కై వంగనిది.. మానై వంగునా.." అనే సామెతను గుర్తు చేస్తూ, బాల్యం నుంచే పిల్లలకు మంచి నడవడిక, బుద్ధులు, నైతిక విలువలు నేర్పించడం చాలా అవసరమని తెలిపారు. బాల్యాన్ని సరైన మార్గంలో తీర్చిదిద్దితేనే వారి భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు బాగుంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సమాజం చాలా వేగంగా మారుతోందని, దీనివల్ల బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయని అన్నారు. అధికారులందరూ చట్ట పరిధిని, తాజా నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. చట్టాల అమలు క్షేత్రస్థాయిలో మాత్రమే స్పష్టమైన ఫలితాలను ఇస్తుందని, అందుకే ప్రాథమిక స్థాయిలో పనిచేసే సిబ్బందికి చట్టాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. బాలల సంక్షేమం, హక్కుల కాపాడటంలో ఎలాంటి అలసత్వానికీ తావులేదని స్పష్టం చేశారు. ప్రతి బిడ్డకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం వంటి విధానాలను బాధ్యతాయుతంగా అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డా. పి.పి. కృష్ణ అర్జున్, డా. జి.వి. మహేష్ నాథ్, వి. శ్రీనయ్య, ఎం. శ్రీనివాస్, ఎం. కల్పన, వి. శివ రంజని, టి. మురళి మోహన్, పి. దేవి మానస, షేక్ మీరా ఖాసీం సాహెబ్, కె. జ్యోతిర్మయి, బి. రజని, వై. బిందుప్రియ, ఏ. ప్రవీణ్, బి. నాగలక్ష్మి, జి. అఖిల గౌడ్, వి. దీప్తి, జి. నిష్క, బి. నాగ సుమ బాల, వి. లావణ్య, జిల్లా బాల సంరక్షణ అధికారిణి విష్ణు వందన, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సిరిపురం రైతులపై అక్రమంగా పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలి

**• ట్రాక్టర్ ధ్వంసం చేసిన సిరి మెటల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి • రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి**







**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:**సిరిపురం గ్రామంలో సిరి మెటల్స్ ఏర్పాటు పేరుతో భూములను నాశనం చేయవద్దని ప్రశ్నిస్తున్న రైతులపై దాడి చేసి, ట్రాక్టర్‌ను, వ్యవసాయ భూమిలో ఉన్న గుడిసె ధ్వంసం చేసి,10 మంది నిర్దోషులపై అక్రమంగా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడం దారుణమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు.సిరిపురం గ్రామంలో సిరి మెటల్స్ సంస్థ ఏర్పాటు విషయంలో రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడం సరికాదని ఆయన పేర్కొన్నారు. సంస్థ యాజమాన్యం రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని రైతులపై దౌర్జన్యానికి పాల్పడటం, పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా నిర్దోషులపై కేసులు నమోదు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.జీవనోపాధిని కోల్పోకుండా తమ భూములు, హక్కుల కోసం ప్రశ్నిస్తున్న రైతు బల్గురి మల్లేష్‌కు చెందిన ట్రాక్టర్‌ను, వ్యవసాయ భూమిలో ఉన్న గుడిసె ధ్వంసం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ట్రాక్టర్ ధ్వంసానికి సిరి మెటల్స్ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించి, రైతుకు జరిగిన నష్టానికి తగిన నష్టపరిహారం చెల్లించా లని కోరారు.అదేవిధంగా ఘటనపై వాస్తవాలను పూర్తిగా పరిశీలించి, నిర్దోషులపై బనాయించిన అక్రమ ఎఫ్.ఐ.ఆర్‌ను వెంటనే రద్దు చేయాలని, కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులపై పోలీసు యంత్రాంగం దౌర్జన్యంగా వ్యవహరించడం మానుకొని, ఇరు వర్గాల వాదనలు విని నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు.రైతుల జీవనోపాధి, భూములు, భవిష్యత్తును దెబ్బతీసే చర్యలను సహించేది లేదని, రాజకీయాలకు అతీతంగా గ్రామంలోని ప్రజలంతా రైతుల పక్షాన ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని మేక అశోక్‌రెడ్డి అన్నారు. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించకుండా రైతులపై కేసులు, దౌర్జన్యాలు కొనసాగిస్తే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.రైతుల అభిప్రాయాలను గౌరవించి, సిరి మెటల్స్ ఏర్పాటు అంశంపై సమగ్రంగా విచారణ జరిపి, రైతులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్,సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బల్గురి అంజయ్య,కందుల మల్లారెడ్డి,శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, నాయకులు కునూరు గణేష్, అంబటి సురేందర్ రెడ్డి, భారత మృత్యుంజయ, రాపోలు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దీక్షిత్ ప్రతిభను అభినందిస్తూ ప్రధాని పోస్ట్ కార్డు ద్వారా ప్రశంసలు

**ప్రేరణ కార్యక్రమంలో ఎంపికైన దీక్షిత్‌కు ఘన సన్మానం**

**తొలి అక్షరం/నెల్లికుదురు ఆగస్టు 22:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నుంచి తెలంగాణ మోడల్ స్కూల్ నెల్లికుదురు,విద్యార్థి ఎస్. దీక్షిత్ ప్రతిష్టాత్మకమైన ప్రేరణ ఎక్స్పరిమెంటల్ లర్నింగ్ ప్రోగ్రాం కు ఎంపికై, గుజరాత్‌లోని ఐఐటీ అహ్మదాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నాడు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, నవోదయ విద్యాలయ సమితి ద్వారా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం విద్యార్థుల్లో భారతీయ వారసత్వం, సంస్కృతి, విలువలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత మరియు నూతన ఆవిష్కరణలపై అనుభవాత్మక అభ్యసనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దీక్షిత్ తన ప్రతిభను చాటుకోవడంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసి విలువైన అనుభవాలను పొందాడు. దీక్షిత్ ప్రతిభను అభినందిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పోస్టుకార్డు ద్వారా ప్రశంసలు అందించడం విశేషం. ఈ సందర్భంగా తెలంగాణ మోడల్ స్కూల్ నెల్లికుదురు, మహబూబాబాద్‌లో దీక్షిత్‌తో పాటు అతనికి మార్గదర్శకులుగా వ్యవహరించిన గైడ్ ఉపాధ్యాయులు శ్రీ టి. శతీష్ మరియు శ్రీమతి ఎం.ఏ. అంజుమ్ సుల్తానాలను పాఠశాల తరఫున ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థి దీక్షిత్‌ను ప్రోత్సహిస్తూ, అతని ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనేలా మార్గనిర్దేశం చేసిన గైడ్ ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది అభినందించారు. మహబూబాబాద్ జిల్లా నుంచి దీక్షిత్ ప్రేరణ కార్యక్రమానికి ఎంపిక కావడం, ఐఐటీ అహ్మదాబాద్‌లో పాల్గొనడం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకోవడం ఆదర్శ పాఠశాల నెల్లికుదురు పాఠశాలకు, తల్లిదండ్రులకు మరియు మహబూబాబాద్ జిల్లాకు గర్వకారణమని పాఠశాల ప్రిన్సిపాల్ గా. ఉపేందర్ రావు,ఉపాధ్యాయులు,సిబ్బంది పేర్కొన్నారు.



# ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా కలం యోధుడు షయాద్ సోయాబుల్లాఖాన్ 78వ వర్ధంతి వేడుకలు

**● టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843 వ్యవస్థాపకులు మామిడి సోమయ్య యూనియన్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ, కార్యదర్శి అర్వపల్లి నగేష్ ● అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 22:** నిరంకుశత్వంపై అక్షరాన్నే ఆయుధంగా మలిచి, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని, ప్రజాస్వామ్య పాలన రావాలని కోరుతూ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ధీర జర్నలిస్టుగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. షోయబుల్లా ఖాన్ 1920 అక్టోబర్ 17న ఖమ్మం జిల్లాలోని సుబ్లేడు గ్రామంలో హబీబుల్లా ఖాన్, లాయహున్నిసా బేగం దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి హబీబుల్లా ఖాన్ రైల్వే శాఖ లో పనిచేసేవారు. మహాత్మాగాంధీకి ఆయన వీరాభిమాని. గాంధీజీ పట్ల ఉన్న అభిమానంతో తన కుమారుడిని ప్రేమగా 'షోయబుల్లా గాంధీ' అని పిలిచేవారని చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. బాల్యం నుంచే షోయబుల్లా ఖాన్ కు సమాజం పట్ల అవగాహన పెరిగింది. బొంబాయిలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఆయన హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీ.ఏ తో పాటు జర్నలిజం విద్యను అభ్యసించారు. మంచి ఉద్యోగం పొందే అవకాశాలు ఉన్నప్పటికీ నిరంకుశ పాలనను ప్రశ్నించేందుకు జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకున్నారు. జాతీయ భావాలను ప్రోత్సహిస్తున్న 'తేజ్' ఉర్దూ వారపత్రికలో సబ్‌ఎడిటర్‌గా చేరిన షోయబుల్లా ఖాన్ నిజాం పాలకులు, వారి అనుచరులైన భూస్వాములు, రజాకారులు ప్రజలపై సాగిస్తున్న దురాగతాలను తన రచనల ద్వారా ఎండగట్టారు. ఆయన రచనలు నిజాం పాలకులకు ఆగ్రహం తెప్పించడంతో 'తేజ్' పత్రిక నిషేధానికి గురైంది. ఆ తర్వాత మందుముల నరసింగరావు ఆధ్వర్యంలో నడిచిన 'రయ్యత్' ఉర్దూ పత్రికలో చేరి తన కలానికి మరింత పదును పెట్టారు. బెదిరింపు లేఖలు వచ్చినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. చివరకు 'రయ్యత్' పత్రిక కూడా నిజాం ప్రభుత్వ ఆగ్రహానికి గురై మూతపడింది. అయినప్పటికీ ప్రజల తరఫున తన పోరాటాన్ని కొనసాగించాలని షోయబుల్లా ఖాన్ నిర్ణయించుకున్నారు. **'ఇమ్రోజ్' పత్రిక స్థాపన.** స్వయంగా జాతీయ భావాలతో కూడిన పత్రికను ప్రారంభించాలని నిర్ణయించుకున్న, షోయబుల్లా ఖాన్ తన తల్లి, భార్య నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో, బూర్గుల రామకృష్ణారావు ఇంటిని అద్దెకు తీసుకుని 'ఇమ్రోజ్' అనే ఉర్దూ దినపత్రికను ప్రారంభించారు. 1947 నవంబర్ 15న 'ఇమ్రోజ్' తొలి సంచిక వెలువడింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పత్రికను ప్రజల గొంతుకగా తీర్చిదిద్దారు. నిజాం నిరంకుశత్వం, రజాకారుల మతదురహంకారం, ప్రజలపై జరుగుతున్న దాడులను ఆయన తన సంపాదకీయాలు, కథనాల ద్వారా తీవ్రంగా విమర్శించారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి నిజాం నిరాకరించాడు. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని షోయబుల్లా ఖాన్ 'ఇమ్రోజ్' ద్వారా బలంగా డిమాండ్ చేశారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం కావాల్సిన అవసరాన్ని వివరిస్తూ, ఆయన అనేక సంపాదకీయాలు రాశారు. హైదరాబాద్ ప్రజల్లో ఎక్కువమంది ఉర్దూ చదువుకున్నవారు కావడంతో 'ఇమ్రోజ్' రచనలు ప్రజలు, మేధావులపై గణనీయమైన ప్రభావం చూపాయి. 1948 జనవరి 29న 'ఇమ్రోజ్'లో ప్రచురించిన 'పగటి ప్రభుత్వంరాత్రి ప్రభుత్వం' అనే సంపాదకీయం షోయబుల్లా ఖాన్ ధైర్యసాహసాలకు నిదర్శనంగా నిలిచింది. ఆయన రచనలు నిజాం ప్రభుత్వానికి, రజాకారులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. **ఖాసిం రజ్వీ బెదిరింపులు.** షోయబుల్లా ఖాన్ పై రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ నుంచి బెదిరింపులు వచ్చాయి. అయినప్పటికీ ఆయన తన రచనా పోరాటాన్ని ఆపలేదు. అన్యాయం ఎక్కడ జరిగినా




అక్కడికి వెళ్లి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. 1948 ఆగస్టు 19న నిజాం వ్యతిరేకంగా వార్తలు, వ్యాసాలు రాస్తే చేతులు నరికేస్తామని, ఖాసిం రజ్వీ బహిరంగంగా హెచ్చరించినట్లు, చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. అయితే షోయబుల్లా ఖాన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. సత్యం కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోవడం కూడా గర్వించదగ్గ విషయమేనని ఆయన ధైర్యంగా ప్రకటించారు. **ఆగస్టు 21 అర్ధరాత్రి దారుణ దాడి.** 1948 ఆగస్టు 21 అర్ధరాత్రి కాచిగూడ ప్రాంతంలోని 'ఇమ్రోజ్' కార్యాలయంలో పని ముగించుకుని షోయబుల్లా ఖాన్ తన బావమరిది ఇస్మాయిల్ ఖాన్‌తో కలిసి ఇంటికి బయలుదేరారు. చప్పల్ బజార్ ప్రాంతానికి చేరుకున్న సమయంలో సాయుధ దుండగులు వారిపై దాడి చేశారు. షోయబుల్లా ఖాన్‌పై కాల్పులు జరిపి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం ఆయన చేతులను దారుణంగా నరికారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆయన బావమరిది ఇస్మాయిల్ ఖాన్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. కాల్పుల శబ్దాలు విని స్థానిక ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న షోయబుల్లా ఖాన్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. **దేశం కోసం మరణిస్తున్నానని గర్వంగా చెప్పిన షోయబుల్లా.** ఆగస్టు 22 తెల్లవారుజామున షోయబుల్లా ఖాన్ స్పృహలోకి వచ్చారు. తన చివరి క్షణాల్లో కూడా ఆయన ధైర్యాన్ని కోల్పోలేదు. మరణం అనివార్యమని, మంచి లక్ష్యం కోసం ప్రాణాలు అర్పించడం గర్వించదగ్గ విషయమని తన తల్లిదండ్రులకు, భార్యకు ధైర్యం చెప్పినట్లు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. నిజాం నిరంకుశత్వాన్ని తన కలంతో సవాలు చేసిన షోయబుల్లా ఖాన్ 28 ఏళ్ల వయసులోనే 1948 ఆగస్టు 22న తుదిశ్వాస విడిచారు. షోయబుల్లా ఖాన్ తన మతానికి చెందిన నిజాం పాలకుడే అయినప్పటికీ నిరంకుశ పాలనను సమర్థించలేదు. రజాకారులు తన మతస్తులే అయినప్పటికీ వారి దారుణాలను ఖండించడంలో వెనుకాడలేదు. మతం పేరుతో జరిగే మతోన్మాదాన్ని ఆయన వ్యతిరేకించారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని, మతమౌఢ్యం లేని ప్రజాస్వామ్య పాలన ఏర్పడాలని ఆయన కలలు కన్నారు. ఆ లక్ష్యం కోసం నడిరోడ్డుపైనే తన ప్రాణాలను త్యాగం చేశారు. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక విలువలు, లౌకిక భావాలు, ప్రజల హక్కుల కోసం తన కలాన్ని ఆయుధంగా మార్చుకున్న షోయబుల్లా ఖాన్ త్యాగం నేటి జర్నలిస్టులకు, ప్రజాస్వామ్యవాదులకు స్ఫూర్తిదాయకం. ఆగస్టు 22న ఆయన వర్ధంతి సందర్భంగా ఈ అసమాన కలం యోధుడి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. షోయబుల్లా ఖాన్ అమరత్వం ప్రజాస్వామ్య పోరాటానికి చిరస్మరణీయం. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843 కోశాధికారి వేములకొండ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎలుగోటి వెంకట్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్లా రాకేష్ రెడ్డి, టీబీజేఏ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, కార్యదర్శి కప్పల మధు గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కిరణ్ కుమార్, గుజ్జు గోపాలకృష్ణ, చిన్నంశెట్టి రాంబాబు, పాగా యోనా, మేకల రవి, మొగిలి నాగేశ్వరరావు, షేక్ మీరా, ఎలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టి.బి. పేషంట్లకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

**- లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 22:** చౌటుప్పల్ పట్టణం లో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా అధ్యక్షతన, చౌటుప్పల్ డాక్టర్స్ అసోసియేషన్ మరియు బద్దం లింగారెడ్డి సౌజన్యంతో క్షయ (టి.బి.) వ్యాధితో బాధపడుతున్న పేషెంట్లకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యాదాద్రి భువనగిరి జిల్లా డీఎంహెచ్‌ఓ ఎం. మనోహర్ టి.బి. పేషెంట్లకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టి.బి. వ్యాధితో బాధపడుతున్న వారు వైద్యుల సూచనలు పాటిస్తూ మందులను క్రమం తప్పకుండా తీసుకోవడంతో పాటు శరీరానికి అవసరమైన పోషకాలు అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. పేద మరియు ఆర్థికంగా వెనుకబడిన టి.బి. పేషెంట్లకు అండగా నిలిచి వారి ఆరోగ్య పరిస్థితి



మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ, సమాజంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రోగులకు సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. దాతలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే మరింత మందికి ఆరోగ్య సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. దేశంలో పోలియోను నిర్మూలించినట్లే టి.బి. వ్యాధిని కూడా పూర్తిగా నివారించే వరకు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం




ఆర్గనైజర్ వంశీ, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు, ట్రస్ట్ కార్యదర్శి మోగుదాల రమేష్ గౌడ్, కోశాధికారి గోశిక కరుణాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎండి అతః పాషా, చౌటుప్పల్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ అవ్వారి శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ సుమన్ కళ్యాణ్, డాక్టర్ కాటంరాజు, దాచేపల్లి రాజు గుప్తా, బత్తిని రఘు గౌడ్, బద్దం లింగారెడ్డి, కాసుల వెంకటేశం, వేముల నరసింహ, కొసనం రాంరెడ్డి, కటకం ప్రశాంత్, నాంపల్లి రమేష్, లక్ష్మణ్ గౌడ్, సిలివేరు మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులు ఇవ్వకుండా సర్వే చేసిన సర్వేయర్‌పై ఆర్డీఓకు ఫిర్యాదు

**● ఫిర్యాదుదారుడు మైలారం రాఘవేంద్ర**



**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 22:** చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామ శివారులో తమ భూమిని ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సర్వే చేసి హద్దురాళ్లు పాతిన సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మైలారం రాఘవేంద్ర చౌటుప్పల్ ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుడి వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామ శివారులో మైలారం నరసింహ, మైలారం పద్మలకు సుమారు ఆరు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని వారు పదేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఇటీవల తమ భూమికి ఆనుకుని ఉన్న మాదిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు భూమి సర్వే కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అయితే తమకు ఎలాంటి ముందస్తు ప్రభుత్వ నోటీసులు ఇవ్వకుండా వెంకటరమణ అనే వ్యక్తి తాను ప్రభుత్వ అసిస్టెంట్ సర్వేయర్‌నని చెప్పుకుంటూ భూమిని సర్వే చేసి హద్దురాళ్లు పాతినట్లు ఆరోపించారు. సమాచారం లేకుండా సర్వే చేసి హద్దులు నిర్ణయించడాన్ని బాధిత రైతు ప్రశ్నించగా, అక్కడి నుంచి అతడిని దౌర్జన్యంగా పంపించి హద్దురాళ్లు పాతినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై మైలారం రాఘవేంద్ర సంఘటనా స్థలానికి వెళ్లి సర్వేయర్‌ను ప్రశ్నించగా, తాను ప్రభుత్వ అసిస్టెంట్ సర్వేయర్‌నని చెప్పినప్పటికీ స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు, ముందస్తు నోటీసులు లేకుండా సర్వే నిర్వహించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కేసు నమోదు చేసి బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు మైలారం రాఘవేంద్ర తెలిపారు.




# జోగుల నరసయ్యకు శుభాకాంక్షలు తెలిపిన లక్ష్మాపురం గ్రామస్తులు

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:** రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మాజీ తొలి సర్పంచ్ జోగుల రామలింగయ్య కనిష్ట పుత్రుడు జోగుల నరసయ్య అడిషనల్ డిప్యూటీ కమిషనర్ సికింద్రాబాద్ కి ఉత్తమ పోలీసు అవార్డు రాష్ట్రపతి చైతన్య తీసుకున్న సందర్భంగా గ్రామంలోని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేయ నైనది .ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నతనం నుంచి కష్టపడి మారుమూల ప్రాంతమైన మా గ్రామం నుండి ఉన్నత స్థాయి అధికారిగా సేవలందిస్తూ రాష్ట్రపతి అవార్డు తీసుకురావడం మా గ్రామానికి గర్వకారణం అని అన్నారు ఆయన కేవలం పోలీసు అధికారిగా కాకుండా గ్రామ అభివృద్ధిలో అనేకసార్లు తన సేవలను అందించారని భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్ గ్రామ పెద్దలు శంబాల. వెంకటేష్ నీల. ఐలయ్య మారోజు. అనంత చారి బత్తిని. వెంకటేష్ వేముల. పాపయ్య బత్తుల. రమేష్ ఆరూరి. నరేష్ తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమ కెరీటం సురవరం సుధాకర్ రెడ్డికి ఘనంగా జోహార్లు అర్పించారు



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:** ప్రజా ఉద్యమాల కోసం జీవితమంతా పోరాడిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా రామన్నపేట మండల కేంద్రంలో సుభాష్ సెంటర్లో సిపిఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారుసిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ మాట్లాడుతూ ఉమ్మడి మహబబ్ నగర్ జిల్లాలో జన్మించి సురవరం సుధాకర్ రెడ్డి నల్లగొండ జిల్లాకు విడదీయరాని అనుబంధం ఉంది అని అన్నారు నల్లగొండ గడ్డపై వామపక్ష ఉద్యమాల కు నాయకత్వం వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు నల్లగొండ లోక్సభ స్థానం నుండి పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికై ప్రజలకు విశిష్ట సేవలు అందించారు అని పేర్కొన్నారు ముఖ్యంగా సాగు నీరు ప్రాజెక్టులను ఎస్ ఎల్ బి సి శ్రీశైలం ఎడమ గట్టు కాలువ డిండి ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు రైతులకు ప్రజల ప్రయోజనాల కోసం అలుపెరుగని పోరాటం కొనసాగించాడని కొని ఆడాడుసిపిఐ జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సురవరం సుధాకర్ రెడ్డి ఎప్పుడు ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల పక్షాన నిలిచిన ఉద్యమ నాయకుడు అని ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే నిజమైన నివాళులు అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రచ్చయాదగిరి ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య సీనియర్ కామ్రేడ్స్ బాలగోని మల్లయ్య ఊట్కూరి భగవంతం వీరమల్ల వెంకటయ్య గంగాపురం యాదయ్య గంగాపురం వెంకటయ్య పర్స సుదర్శన్ కళ్లం యాదయ్యఊట్కూరి కృష్ణ వీసం గాలయ్య పల్లె మల్లేశం సిహెచ్ మల్లేశం రచ్చ దయాకర్ గంజి అశోక్ తదితరులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన గర్దాస్ విక్రమ్

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:** చిట్యాల మండలం వెంకటాపురం లో జరిగిన జిట్టబోయిన పద్మ -మల్లేశం కుమారుడు నరేందర్ నిశ్చితార్థ కార్యక్రమం లో పాల్గొని కాబోయే నూతన వధూవరులతో కేక్ కటింగ్ చేయించి శుభాకాంక్షలు తెలియచేసినతెలంగాణా రాష్ట్ర సర్పంచుల ఫోరం జాక్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్ధాస్ విక్రమ్. ఈ కార్యక్రమంలో యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్, చేనేత సహకారసంఘము చైర్మన్ రవ్వ నర్సింహా, జిట్టబోయిన వెంకటేష్, కంబాలపల్లి స్వామి, మాజీ ూవీజ డైరెక్టర్ గర్ధాస్ కరుణాకర్, పాలసంఘము చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం డైరెక్టర్ రాజన్నగారి అలివేలు మురళి, పగుడాల నరేందర్, మాధం నాగేష్, దగ్గుల మల్లేష్, సింగణబోయిన నవీన్, గార్ధుల అరుణ్ ,సింగణబోయిన శేఖర్, ఎర్రబోయిన స్వామి, సింగణబోయిన దినేష్ యాదవ్, సింగణబోయిన గణేష్, బందెల శివ తదితరులు పాల్గొన్నారు



# హోదా చిన్నది.. సత్తా పెద్దది: యాదవ్‌రెడ్డిపై వేం చెరగని నమ్మకం!

**హైదరాబాద్‌లో ఎంపీని కలిసిన నూతన మండల అధ్యక్షుడు, ఘన సత్కారం**

**అంతర్గత విభేదాలకు స్వస్తి చెప్పి కాంగ్రెస్ బలోపేతానికి దిశానిర్దేశం**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 22 నెల్లికుదురు:** పదవుల హోదా కంటే ప్రజలలో ఉండే నిబద్ధత, నాయకత్వ లక్షణాలే అసలైన బలమని ఎంపీ వేం నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో అత్యంత స్వల్ప ఓట్ల తేడాతో విజయం చేజారినప్పటికీ, ఆ ఒక్క ఓటమికి కృంగిపోకుండా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యమైన అరుదైన నేత యాదవ్‌రెడ్డి అని కొనియాడారు. జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలను సైతం ఎంతో నిబద్ధతతో నిర్వహించిన ఆయన నాయకత్వ పటిమపై పూర్తి నమ్మకంతోనే పార్టీ అధిష్ఠానం నెల్లికుదురు మండల కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను అప్పగించిందని స్పష్టం చేశారు. నూతనంగా నియమితులైన యాదవ్‌రెడ్డి హైదరాబాద్‌లోని వేం నరేందర్‌రెడ్డి స్వగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా యాదవ్‌రెడ్డిని శాలువాతో ఎంపీ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని ప్రజా సమస్యలు, క్షేత్రస్థాయి రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతంపై ఇరువురి మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక నాయకుడికి లభించే పదవి చిన్నదా, పెద్దదా అని ప్రతిపక్షాలు వ్యాఖ్యానించినా, క్షేత్రస్థాయిలో ప్రజలను, పార్టీని సమర్థవంతంగా నడిపించగల ధీరుడనే సంకల్పంతోనే ఈ కీలక బాధ్యతలు అప్పగించామన్నారు. మండలంలో పార్టీలకు అతీతంగా ప్రజలతో మమేకం కావాలని, అంతర్గత విభేధాలు, గ్రూపు రాజకీయాలకు అస్కారం ఇవ్వకుండా ముందుకు సాగాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లికుదురు మండలంలో సాధించిన ఆధిక్యాన్ని రాబోయే రోజుల్లో మరింత రెట్టింపు చేసేలా యువతను, సీనియర్లను ఏకతాటిపైకి తెచ్చి కార్యోన్ముఖులను చేయాలని దిశానిర్దేశం చేశారు. మండల సమస్యల పరిష్కారంలో తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. **ప్రజాసేవే ధ్యేయం..**

**కార్యకర్తలే నా బలం: యాదవ్‌రెడ్డి** పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన అపారమైన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నెల్లికుదురు మండలంలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని యాదవ్‌రెడ్డి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాలకు తావులేకుండా, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ గౌరవిస్తూ, యువతకు రాజకీయ మార్గదర్శిగా నిలుస్తానన్నారు. రాజకీయాల్లో విలువలు, గౌరవం, నిబద్ధతలే తన మార్గదర్శకాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడటమే తన ప్రాథమిక కర్తవ్యమని పేర్కొన్నారు. మండలంలో ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని, పార్టీ జెండాను ప్రతి గ్రామంలో బలంగా పాతుతామని విశ్వాసం వ్యక్తం చేశారు.

## సీనియర్ పాత్రికేయులు ఇబ్రహీం సంతాప సభ...

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:** ఈనెల 24 సోమవారం రోజున ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయులు మొహమ్మద్ ఇబ్రహీం సంతాప సభ మండల కేంద్రంలోని దుర్గయ్య కాంప్లెక్స్ లోని మినీ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు సీనియర్ పాత్రికేయులు కనతాల శశిధర్ రెడ్డి, బూరుగు వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1975 నుండి 2026 వరకు సుమారు 51 సంవత్సరాలు పాత్రికేయ వృత్తిలో కొనసాగిన ఇబ్రహీం ఉన్నతమైన విలువలతో పాత్రికేయవృత్తిని కొనసాగించాలని వారు తెలిపారు. ఈ సంతాప సభకు ఆయనతో అనుబంధం ఉన్న ప్రజాప్రతినిధులు, మిగతా పార్టీల నాయకులు, అభిమానులు, తోటి పాత్రికేయులు విచ్చేసి ఆయనకు నివాళులర్పించాలని కోరుతున్నాం.

## బాచుపల్లి బోనాల సందర్భంగా ఫలారం బండి ఊరేగింపు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 22:** బాచుపల్లి బోనాల సందర్భంగా ఆదివారం ఫలారం బండి ఊరేగింపు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఊరేగింపు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, బోనాల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫలారం బండి ఊరేగింపును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 22:** జిల్లపరిషత్ ప్రభుత్వ పాఠశాల లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సధస్సు లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ శిరీషా పాల్గొన్నారు. విద్యార్థులకు చైల్డ్ లేబర్ యాక్ట్, రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్,చైల్డ్ ప్రొటెక్షన్ యాక్ట్,ట్రాఫిక్ రూల్స్, ఫోక్సో, డ్రగ్స్ కన్సప్షన్ వంటి చట్టాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణా రాష్ట్ర సర్పంచుల ఫోరం జాక్ కార్యదర్శి సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ చట్టాలపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం లో కోర్ట్ సిబ్బంది మన్నన్ ఖాన్, పాపయ్య, సునీల్, ప్రాధనోపాధ్యాయురాలు నిర్మల, కే. లింగచారి, పీడీ మని ఉపాధ్యాయులు ఏ ఏ పి సి చైర్మన్ కొమ్మగోని మమత, విద్యార్థుల తల్లితండ్రులు, నాగు నిరోషా, పగుడాల నరేందర్, వెలిమినేటి నరేష్, భువగిరి మధు,మేకల నరేందర్,గర్ధాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



**పార్థివ దేహాన్ని పూలమాలవేసి నివాళు లర్పించిన చెరువు ముందరి తండ గ్రామ సర్పంచ్ కునుసోతు -మంగమ్మ శ్రీను నాయక్**

**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 22:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చెరువు ముందరి తండా గ్రామ పంచాయతీ లో సోమ్లా తండాలో బానోతు కిషన్ నాయక్ అనారోగ్యంతో మరణించడం జరిగింది. వారి పార్థివదేహాన్ని పూలమాలవేసి నివాళులర్పించిన చెరువు ముందరి తండా గ్రామ సర్పంచ్ కునుసోతూ మంగమ్మ శ్రీను నాయక్ ,వివిధ పార్టీ నాయకులు గుగులోతు శ్రీనివాస్ బానోతు నరేష్ తదితరులు నివాళులర్పించారు.

## వెంకటయ్య యాదవ్ మృతి చాలా బాధాకరం: దైద రవీందర్




**తొలి అక్షరం/రామన్నపేట 22:** కొర్లపాడు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావుల వెంకయ్య యాదవ్ అనారోగ్యంతో మృతి చెందగా వారి మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించిన కుటుంబ సభ్యులను పరామర్శించిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిఈ కార్యక్రమంలో కొర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ కుమ్మరి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బీరోలు ఉపేందర్ రెడ్డి నాగయ్య గ్రామ శాఖ అధ్యక్షుడు బై అంజయ్య యాదవ్ ఇప్పలగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడు సైదులు యాదవ్ మహేష్ యాదవ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వం బీసీలను విస్మరిస్తే జాతీయ స్థాయిలో నిరసనలు చేపడతాం

- నవంబర్ నెలలో పార్లమెంటుని ముట్టడిస్తాం.
- రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్




**తొలి అక్షరం :వలిగొండ, ఆగస్టు 22:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ పాల్గొని వలిగొండ మండలం బిసి సంగం అధ్యక్షులు సాయిని యాదగిరి సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించి మీడియా ద్వారా మాట్లాడినారు. సెప్టెంబర్ నెల24న బీసీ సంఘాల ఆధ్వర్యంలో, బిసి కులాల జనగణన చేపట్టాలని జాతీయ స్థాయిలో శాంతి యుతంగా నిరసనలు, సెప్టెంబర్ 25న హైదరాబాదులో బీసీ సంఘాల సమక్షంలో ప్లీనరీ సమావేశాలు, నవంబరు నెలలో జాతీయస్థాయిలో బీసీ సంఘాల సమక్షంలో జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని మీడియా ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్,యువజన సంఘం జిల్లా అధ్యక్షులు వరికుప్పల మధు, వలిగొండ పట్టణం యువజన సంఘం అధ్యక్షులు నానంచర్ల రమేష్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు పాటి కొండ విక్రమ్, యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు నరేష్ ప్రజాపతి, గూడూరు భాస్కర్, పాల్గొన్నారు.

## పిల్లాయిపల్లి పిల్ల కాలువ సర్వే రెండవ రోజు పూర్తి

- రైతుల భూముల్లో మార్కింగ్..
- కాలువకు భూములు ఇస్తున్న రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు
- కాయితి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్, పెద్దకొండూరు
- బద్దం కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ, పెద్దకొండూరు



**తొలి అక్షరం/చౌటుప్పల్. ఆగస్టు 22:** చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు చెరువుకు పిల్లాయిపల్లి పిల్ల కాలువ ద్వారా సాగునీరు అందించే లక్ష్యంతో కాలువ సర్వే పనులు చేపట్టారు. జిబ్లక్‌పల్లి నుంచి పెద్దకొండూరు చెరువు వరకు కాలువ మార్గాన్ని సర్వే చేయడంతో పాటు, రెండో రోజు మసీదుగూడెం నుంచి జిబ్లక్‌పల్లి వరకు కాలువ సర్వేను పూర్తి చేశారు. సర్వేలో భాగంగా రైతుల భూముల్లో కాలువకు సంబంధించిన ప్రాంతాలను గుర్తించి మార్కింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు. కాలువ నిర్మాణానికి సహకరిస్తూ తమ భూములను అందించేందుకు ముందుకు వస్తున్న రైతులకు పెద్దకొండూరు మాజీ సర్పంచ్ కాయితి రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సహకారంతో కాలువ పనులు త్వరితగతిన పూర్తయి, పెద్దకొండూరు చెరువుకు సాగునీరు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు.



## వృద్ధుల హక్కులపై అవగాహన కల్పించాలి

**వృద్ధుల సంక్షేమానికి చట్టపరమైన రక్షణ**

**16వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్. స్వాతిరెడ్డి**




**తొలి అక్షరం/షాద్ నగర్,ఆగస్టు22:** ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లోని ఎఫ్‌సీఎన్ ఓల్డేజ్ హోమ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి 16వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్. స్వాతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల హక్కుల పరిరక్షణకు చట్టాలు కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. సీనియర్ సిటిజన్స్ యాక్ట్, ఉచిత న్యాయ సలహా, న్యాయ సేవా అధికార సంస్థ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓల్డేజ్ హోమ్‌లోని వసతులను పరిశీలించిన జడ్జి.. అక్కడి వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల పట్ల సమాజం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఎన్ ఫైనాన్షియల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, హోమ్ ఇన్‌చార్జి శ్రీను, నర్సులు, పారాలీగల్ వాలంటీర్లు టీ. బాల్‌రెడ్డి, సంజీవ పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ నగర్‌లో ఘనంగా బోనాల వేడుకలు




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 22:** రాజీవ్ గాంధీ నగర్‌లో ఆదివారం బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 15వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గాజుల సుజాతక్క ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా గాజుల సుజాతక్క మాట్లాడుతూ.. "అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, కాలనీ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటూ ఈ బోనాల వేడుకలను నిర్వహిస్తున్నాం. మన సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకుంటూ అందరం కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలి" అని పిలుపునిచ్చారు. బోనాల అనంతరం కాలనీ ప్రజలందరికీ ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళలు, ఆడపడుచులు, పిల్లలు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని సుజాతక్క విజ్ఞప్తి చేశారు.

# 22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలి

- రాపోలు నిర్మలానరసింహ నేత తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి



**తొలి అక్షరం/రామన్నపేట 22:** 22-ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములు కూడా చేర్చడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.... ఒక సర్వే నంబర్‌లో కొంత మేరకు మాత్రమే నిషేధిత భూమి ఉన్నప్పటికీ, మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ఆ భూమిలో ఎలాంటి వివాదం లేని యజమానులు కూడా రిజిస్ట్రేషన్, అమ్మకం, కొనుగోలు, బ్యాంకు రుణాలు వంటి అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారు.... తమ సొంత భూమిపై హక్కు ఉన్నప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం ఆందోళన కలిగించే విషయంరెవెన్యూ వ్యవస్థలో గ్రామస్థాయి నుంచి భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిషేధిత భూమి ఎంత మేరకు ఉందో స్పష్టంగా గుర్తించే పటిష్టమైన వ్యవస్థ అవసరం.... కొంత భాగం మాత్రమే నిషేధిత జాబితాకు సంబంధించినదైతే, మొత్తం సర్వే నంబర్‌ను కాకుండా సంబంధిత భూమిని మాత్రమే నిషేధిత జాబితాలో నమోదు చేసే విధంగా రికార్డులను శాస్త్రీయంగా సరిచేయాలి పాత రికార్డులు, ప్రస్తుత భూ పరిస్థితులు, హక్కు పత్రాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను సమగ్రంగా పరిశీలించి తప్పులుంటే వాటిని సులభమైన విధానంలో సరిచేసే అవకాశం కల్పించాలిప్రభుత్వం ఈ సమస్యను అత్యంత సున్నితమైన ప్రజా సమస్యగా పరిగణించి లోతైన సమీక్ష చేపట్టాలి.... నిర్దోషులైన భూ యజమానులను భయభ్రాంతులకు గురిచేయకుండా, వారి విలువైన సమయాన్ని వృథా చేయకుండా, ఆఫీసుల చుట్టూ తిప్పుకోకుండా గ్రామస్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించే విధానం తీసుకురావాలి.... భూ హక్కుల విషయంలో పారదర్శకత, న్యాయం, ప్రజలకు సులభమైన సేవలు అందేలా తక్షణ చర్యలు తీసుకుని 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న తప్పులను సరిచేసి బాధిత భూ యజమానులకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

# ప్రజల ప్రాణాలకు రక్షణ లేని కంపెనీలు ఎందుకు.?

- బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు అశోక్ గౌడ్..
- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏల చంద్రశేఖర్.



**తొలి అక్షరం :వలిగొండ, ఆగస్టు 22:** భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతి గూడెం విలేజ్ హేజ్ కంపెనీలో సి బ్లాక్ లో పేలిన రియాక్టర్ కారణంగా కంపెనీ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ యొక్క ధర్మా లో ముఖ్యఅతిథిగా భువనగిరి బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూరు అశోక్ గౌడ్ ఈ ధర్నాను గురించి మాట్లాడుతూ ఈ యొక్క కంపెనీలో జరిగినటువంటి పేలుడు రియాక్టర్ ల వల్ల కంపెనీ లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది ఈ యొక్క ప్రాణాలను ప్రతి పేలుడులో ఎన్నో కొన్ని డబ్బులు ఇచ్చి కంపెనీ చేతులు దులుపుకుంటుంది కానీ పేదప్రాణాలకు లెక్కచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నటువంటి ఇలాంటి కంపెనీ వెంటనే మూసివేయాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ ధర్నాలో మండల అధ్యక్షులు మేకల రవీందర్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లె కాడి బసవయ్య, జిల్లా ఎస్సీ మోర్చా చెరుకు వెంకటేష్,మాజీ మండల అధ్యక్షులు మేకల చొక్కా రెడ్డి, దోతి గూడెం గ్రామ ఉపసర్పంచ్ బద్దం వెంకటరెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ ముద్దం హరీష్, మండల నాయకులు గుమ్మి దామోదర్ రెడ్డి, ఈ యాట శ్రీనాథ్, వస్పరి రాకేష్, వస్పరి నరేందర్, తరుణ్, వంశీ, నవీన్, విజయ్, ముఖేష్, కిరణ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఆస్తిలో వాటా కోసం అత్తింటి ముందర మహిళ నిరసన

- ఇద్దరు కుమార్తెలతో కలిసి భార్య ధర్నా..
- పట్టించుకోని అత్తమామలు న్యాయం చేయాలని బాధితురాలు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 22:** నెల్లికుదురు మండల కేంద్రంలోని (మునిగలవీడు) గ్రామంలోభర్త చనిపోయి ఐదేళ్లయినా.. అత్తింటివారు ఇంట్లోకి రానివ్వకపోవడంతో, ఆస్తిలో రావాల్సిన న్యాయమైన వాటా కోసం ఇద్దరు కుమార్తెలతో కలిసి ఓ మహిళ అత్తింటి ముందే నిరసనకు దిగిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామంలో శనివారం వెలుగు చూసింది.బాధితురాలు దేశబోయిన వెంకటలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మునిగలవీడు గ్రామానికి చెందిన దేశబోయిన శ్రీనుతో ఆమెకు వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఐదేళ్ల క్రితం శ్రీను అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మరణానంతరం అత్తింటివారు వెంకటలక్ష్మిని, ఆమె పిల్లలను ఇంట్లోకి రానివ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసి వెళ్లగొట్టారు. దీంతో వేరే దారిలేక ఆమె తన పుట్టింటి గ్రామమైన మధనతూర్తికి వెళ్ళి, కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటోంది.భర్తకు చెందిన ఆస్తిలో తనకు, తన కుమార్తెలకు చట్టబద్ధంగా రావాల్సిన వాటాను ఇవ్వాలని పలుమార్లు అత్తమామలను, కుటుంబ సభ్యులను కోరినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోలేదు. అత్తింటికి వెళ్లేందుకు ప్రయత్నించినా బెదిరింపులకు దిగుతున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో న్యాయం కోసం గత్యంతరం లేక గడచిన రెండు రోజులుగా ఇద్దరు కుమార్తెలను వెంటబెట్టుకుని మునిగలవీడులోని అత్తింటి ముందే ధర్నా చేపట్టింది.తమకు రావాల్సిన ఆస్తి వాటాను ఇప్పించి న్యాయం చేయాలని, తనను, పిల్లలను అనాథలుగా మార్చిన అత్తింటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెంకటలక్ష్మి తెలిపింది. అధికారులు, పోలీసులు స్పందించి తమకు రక్షణ కల్పించి, న్యాయమైన హక్కులను కల్పించాలని వేడుకుంటోంది.

# ట్రినిటీ హైస్కూల్‌లో బలవర్ధక ఆహార పదార్థాల ప్రదర్శన

## కూరగాయలు, పండ్లతో చిన్నారుల్లో అవగాహన సృజనాత్మకతకు దోహదం



**తొలి అక్షరం/చౌటుప్పల్. ఆగస్టు 22:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్ కిడ్స్ జోన్‌లో బలవర్ధక ఆహార పదార్థాలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల కూరగాయలు, పండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను పాఠశాల డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ.. వివిధ రకాల కూరగాయలు, పండ్లను ప్రదర్శనలో ఉంచి చిన్నారులకు చూపించడం వల్ల వాటి పేర్లు, ఆకారాలను సులభంగా గుర్తించగలుగుతారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో సృజనాత్మక శక్తి, మానసిక ఆలోచనా సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అలాగే వివిధ రకాల కూరగాయలు, పండ్లు తీసుకోవడం వల్ల పిల్లలకు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకరమైన అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. వాటి ఉపయోగాలపై చిన్నారులకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కే.వి.బి. కృష్ణారావు, కోఆర్డినేటర్లు స్వరూప, భార్గవి, మౌనికతో పాటు ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ఝాన్సీ, సుమలత, అశ్విని, శిరీష, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రాజ్యాధికారమే జనసేన లక్ష్యం

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** రాబోయే ఎన్నికల్లో అధికారమే దిశగా జనసేన పార్టీ ఎజెండా ఉంటుందని జనసేన రాష్ట్ర నాయకులు తుళ్లూరి రాము తెలిపారు. హనుమకొండ శ్రీ హర్ష కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసినవరంగల్,మహబూబాబాద్ పార్లమెంట్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆర్ కే సాగర్,నేమూరి శంకర్ గౌడ్,కరాటే ప్రభాకర్ లతో కలిసి పాల్గొన్నారు.అనంతరం తుళ్లూరి రామ్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్టంలో'సాధక్'లను సన్మానించుకోవాలనే దృక్పదంతో,పోటీ చేసిన అభ్యర్థులను సత్కరించుకుంటూ,కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానిస్తూ,రానున్న జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల్లో,మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేస్తుందని కచ్చితంగా తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ...కార్యకర్తలు,నాయకులు ఐకమత్యంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.సుదీర్ఘ కాలం నుండి పార్టీ కోసం పని చేస్తన్న వారిని గౌరవిస్తూ,కొత్తవారిని కలుపుకుంటూ ముందుకెళ్ళాలని అన్నారు.జనసేన పార్టీ ప్రచార కార్యదర్శి ఆర్ కె సాగర్ మాట్లాడుతూ...జనసేన పార్టీని చూస్తే ఇతర పార్టీలకు అప్పుడే భయం మొదలైందని,ముమ్మందు అన్ని రాజకీయ పార్టీలకు దీటుగా జనసేన పార్టీ ఉంటుందని అన్నారు.కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో భాగంగా హన్మకొండ ఫాతిమా సెంటర్ నుండి శ్రీ హర్ష కన్వెన్షన్ వేదిక వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.మార్గమధ్యలో అదాలత్ సర్కిల్ అమరవీరుల స్థూపం దగ్గర తెలంగాణ అమరవీరులకు నివాళి అర్పించారు.డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళి అర్పించారు.వరంగల్,మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన'సాధక్'లను ప్రత్యేకంగా సన్మానించారు.జనసేన తరపున ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన వారిని సత్కరించారు.ఈ సందర్భంగా అనేకమంది యువత,మహిళలు,నాయకులు జనసేన పార్టీలో చేరారు.జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దుంపటి శ్రీనివాస్,రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి దామోదర్ రెడ్డి,మచ్చ సుధాకర్,డాక్టర్ గడల శ్రీనివాస్,అల్లాడి తనీష్,సురేష్ రెడ్డి,ప్రేమ్ గాంధీ,హైందవి రెడ్డి,మీసాల శ్రీనివాస్ రావు,మిరియాల రామకృష్ణ,రవిష్,మంథని సంపత్,సంతోష్ నాయక్,ఆంజనేయులు,రాము యాదవ్,శ్రీధర్ శర్మ, వరంగల్ పార్లమెంట్ నాయకులు గాదె పృథ్వీ,కరాటే ప్రభాకర్,గోళ్ళ రాజేంద్రప్రసాద్,డాక్టర్ పద్మజా దేవి,అకుల శ్రీకాంత్,గడ్డం రాకేష్,బాలు గౌడ్,బైరీ వంశీ,ఆంజనేయులు గౌడ్,అనుదీప్,అభిలాష్,వెల్తూరి నగేష్,చక్రపాణి,శివకోటి ప్రశాంత్ రెడ్డి,బర్ల శివ సనత్,రామ్ ప్రసాద్,చింత రమేష్,అమంచ సునీల్,కొలిపాక ప్రశాంత్,నామాల సిద్దులు గౌడ్,రాజ్ కుమార్,వీర మహిళలు పద్మావతి,సౌమ్య,నాగమణి,షబాన,సునీత గౌడ్,మెడిద శోభ,జన సైనికులు,వీర మహిళలు పాల్గొన్నారు.







# వార్డు సభ్యుడు వానరాసి స్వామికి మరో ఉన్నత పదవి...

## ఫరూక్ నగర్ మండల వార్డు సభ్యుల ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవం..

## ప్రజల సేవకు మరింత బాధ్యత పెరిగిందన్న వానరాసి స్వామి...





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు22:** నాగులపల్లి గ్రామ వార్డు సభ్యుడు వానరాసి స్వామికి మరో ఉన్నత పదవి. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం వార్డు సభ్యుల మండల ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన స్వామి. శనివారం సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ లో జరిగిన వార్డు సభ్యుల సమావేశంలో కీలక పదవి. వార్డు సభ్యునిగా బాధ్యతలు చేపడుతూ మరో ఉన్నతమైన పదవి రావడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన వానరాసి స్వామి. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ..... గత ఎన్నికల నుండి పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి గెలుపే దిశగా పనిచేస్తున్న నన్ను మరో ఉన్నతమైన పదవికి ఎన్నిక చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వార్డు సభ్యునిగా నాగులపల్లి గ్రామానికి అన్ని విధాల అభివృద్ధి చేస్తూ ప్రజలకు అండగా ఉంటాననీ అన్నారు. మండల ఉపాధ్యక్షునిగా మరో ఉన్నత ఆలోచన విధానాలతో ప్రజా సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. మనం మంచి చేస్తూ సమాజంలో మార్పు కోసం ప్రయత్నిస్తుంటే అవకాశాలు ఎన్నో లభిస్తాయని తన విషయంలో కూడా అదే జరిగిందని అన్నారు. నిరంతరం తనకున్న బాధ్యతను మరింత రెట్టంపు ఉత్సాహంతో ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

# హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించవచ్చు

## కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పించిన హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు22:** హెచ్‌పీవీ టీకాపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవడానికి టీకా తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు సూచించారు. మొగిలిగిద్దలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 8, 9, 10వ తరగతి విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జె. శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్‌పీవీ అనేది సాధారణంగా కనిపించే వైరస్ అని, ఇందులోని కొన్ని అధిక ప్రమాద రకాల వల్ల భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు ఇతర క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. హెచ్‌పీవీ సంక్రమణను, దాని వల్ల కలిగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ టీకా అత్యంత ప్రభావవంతమైన రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సమీక్షల ప్రకారం హెచ్‌పీవీ టీకా సురక్షితమైనదని, సమర్థవంతమైనదని పేర్కొన్నారు. టీకా తీసుకున్న తర్వాత ఇంజెక్షన్ వేసిన ప్రదేశంలో స్వల్ప నొప్పి లేదా వాపు, తేలికపాటి జ్వరం, అలసట, తలనొప్పి వంటి తాత్కాలిక లక్షణాలు కనిపించవచ్చని, సా ధారణంగా ఇవి తగ్గిపోతాయని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది సూచనల మేరకు అర్హత ఉన్న బాలికలు తప్పకుండా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని సూచించా రు."టీకా నేడు ఆరోగ్యకరమైన భవిష్యత్తు రేపు" అనే సందేశంతో విద్యార్థినుల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత, కేజీబీవీ పాఠశాల స్టాఫ్ నర్స్ సంతోష, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కర్కాలలో 224 ట్రిప్పుల అక్రమ ఇసుక సీజ్

## - ఈ నెల 27న బహిరంగ వేలం

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూరు ప్రతినిధి (సాంబ పస్తం),ఆగస్టు22:** తొర్రూరు మండల పరిధిలోని కర్కాల గ్రామం లో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక నిల్వలపై అధికారులు ఉక్కుపాదం మోపారు.ఇండ్ల ప్రాంగణాలు, వ్యవసాయ పొలాల్లో చట్టవిరుద్ధంగా దాచి ఉంచిన సుమారు 224 ట్రిప్పుల ఇసుకను రెవెన్యూ శాఖ అధికారులు గురువారం సీజ్ చేశారు. సేకరించిన సమాచారం ప్రకారం... గ్రామంలోని వివిధ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారంతో అధికారులు తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన పలువురి స్థలాల్లో ఉంచిన 224 ట్రిప్పుల ఇసుకను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ఈ ఇసుక మొత్తాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 27న (గురువారం) ఉదయం 11.30 గంటలకు కర్కాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తిగల పాటదారులు వేలానికి ఒక గంట ముందుగా రూ. 10వేల డిపాజిట్ రుసుమును చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.అత్యధిక ధర పలికిన పాటదారులు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ పేరిట డీడీ రూపంలో పూర్తి సొమ్ము చెల్లించిన తర్వాతే ఇసుకను అప్పగిస్తామని స్పష్టం చేశారు.

# రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతికి ఘన నివాళులు

### సమాజ సంస్కరణకు మార్గదర్శి..రాజా బహదూర్ వెంకట రామారెడ్డి
### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు22:** షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి హైదరాబాద్ సామాజిక, విద్యా రంగాల అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖ సామాజిక సంస్కర్త, విద్యావేత్త అని కొనియాడారు. నిజాం పాలనలో కోత్వాల్‌గా పనిచేసిన ఆయన పరిపాలనా బాధ్యతలతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సామాజిక అసమానతలు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడుతూ వెనుకబడిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు.విద్యే సమాజ అభివృద్ధికి ప్రధాన సాధనమని భావించిన ఆయన బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని, నారాయణగూడ బాలికల ఉన్నత పాఠశాల, పరోపకారిణి బాలికల పాఠశాల వంటి విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేశారని ఎమ్మెల్యే వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే విద్యార్థుల వసతి సమస్యను గుర్తించి బాలుర, బాలికల



హాస్టళ్ల ఏర్పాటుకు కూడా కృషి చేశారని తెలిపారు.పేదలు, వెనుకబడిన వర్గాలకు విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు మహిళా విద్య, సాధికారతకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే అన్నారు. విద్య, సామాజిక సమానత్వం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ కొప్పుల మదన్ మోహన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, ఫరూక్‌నగర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, కౌన్సిలర్ పెంటయ్య



మురళీమోహన్, రాజు నాయక్, బచ్చలి నరేష్, సయ్యద్ ఖదీర్, ముబారక్ అలీ ఖాన్, మాజీ జడ్పీటీసీ వెంకటరాం రెడ్డి, కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ శ్రీధర్ రెడ్డి, గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు.అలాగే సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు రాంబల్ నాయక్, పినపాక ప్రభాకర్, దొడ్డి శ్రీనివాస్, అబ్దుల్ రజాక్, శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ లట్టుపల్లి మోహన్ రెడ్డి, నేతలు చెంది తిరుపతి రెడ్డి, చెంది మహేందర్ రెడ్డి, పందెం చెన్నారెడ్డి, పాండురంగారెడ్డి, విఘ్నేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సందీప్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రపాల్ రెడ్డి, చందు నాయక్, జంగారి రవి, సందీప్ గౌడ్, వినాయక గౌడ్, మాధవులు యాదవ్, కత్తి చంద్రశేఖరప్ప, అన్వర్, ఇబ్రహీం, శ్రీహరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మేనకోడలు వివాహానికి కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆహ్వానం



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు22:** ఈ నెల 27వ తేదీన జరగనున్న తమ మేనకోడలు రాణిశివకుమార్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తనయుడు కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ ను సాదరంగా ఆహ్వానించారు.వివాహ ఆహ్వాన కార్యక్రమంలో భాగంగా మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన శుభలేఖలను అందజేశారు.ఇందులో మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, చెంది తిరుపతి రెడ్డి, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్,సీతారాం తదితరులు ఉన్నారు.

## పరిశోధనా ప్రతిభతో శ్రీవీణకు అంతర్జాతీయ గుర్తింపు

### మిల్లెట్ చిక్కీ తయారీపై శ్రీవీణ పరిశోధనకు అరుదైన గౌరవం
### వ్యవసాయ కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన యువ పరిశోధకురాలు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 22:** నెల్లికుదురు మండలం: మునిగలవీడు గ్రామానికి చెందిన పట్నం శెట్టి శ్రీవీణ పరిశోధనా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు. వ్యవసాయ నేపథ్యానికి చెందిన నాగరాజు కుమార్తె అయిన శ్రీవీణ.. మిల్లెట్లను విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులుగా అభివృద్ధి చేసే అంశంపై పరిశోధన చేసి ఈ ఘనత సాధించారు.పెర్ల్ మిల్లెట్ (సజ్జలు)ను ఉపయోగించి పోప్డ్ మిల్లెట్‌తో మిల్లెట్ చిక్కీ తయారీపై ఆమె నిర్వహించిన పరిశోధనా పత్రం "పొంగించిన సజ్జలతో మిల్లెట్ చిక్కీ తయారీపై ఉత్పత్తి అభివృద్ధి" అనే అంశంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమైంది. ఈ పరిశోధనా పత్రం ఐఐపీ సిరీస్‌లో ప్రచురించబడటంతో పాటు, పరిశోధనకు గ్లోబల్ రిజిస్ట్రేషన్ కూడా లభించినట్లు తెలిపారు.వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన శ్రీవీణ అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనా పత్రాన్ని ప్రచురించి గుర్తింపు పొందడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె సాధించిన విజయం గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో పాటు పరిశోధనా రంగంలో రాణించాలనుకునే యువతకు స్ఫూర్తిగా నిలిచిందని పలువురు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేపట్టి ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## ప్రధాని మోదీ కార్యాలయం (పి ఎం ఓ ) నుంచి పోస్టుకార్డు.. విద్యార్థి సింగరం దీక్షిత్‌కు ఘన సన్మానం!

### 'ప్రేరణ'లో అసాధారణ ప్రతిభ.. మోడల్ స్కూల్ విద్యార్థికి పిఎంఓ అభినందనలు
### న్యూఢిల్లీ నుంచి నేరుగా ప్రశంసల లేఖ..
### మహబూబాబాద్ జిల్లాకు అరుదైన గౌరవం
### గైడ్ టీచర్లు సతీష్, అంజుమ్‌ల కృషి
### అభినందనీయమన్న ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 22 నెల్లికుదురు (మహబూబాబాద్):** గుజరాత్‌లోని ఐఐటీ అహ్మదాబాద్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'ప్రేరణ' అనుభవపూర్వక అభ్యసన కార్యక్రమంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి సింగరం దీక్షిత్‌కు భారత ప్రధాని కార్యాలయం ( పి ఎం ఓ ) నుంచి అరుదైన గౌరవం దక్కింది. న్యూఢిల్లీలోని ప్రధాని కార్యాలయం నుంచి నేరుగా



ప్రధాని నరేంద్ర మోదీ అభినందన సందేశంతో కూడిన పోస్టుకార్డు రావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ జి. ఉపేందర్ రావు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పీఎం శ్రీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థి సింగరం దీక్షిత్‌ను ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి ప్రధాని మోదీ నుంచి నేరుగా పోస్టుకార్డు రూపంలో ప్రశంసలు అందుకోవడం పాఠశాలకే కాకుండా, మహబూబాబాద్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. విద్యార్థులు దీక్షిత్‌ను ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.**గైడ్ టీచర్లకు ప్రత్యేక అభినందనలు** విద్యార్థి దీక్షిత్‌కు 'ప్రేరణ' కార్యక్రమంపై సరైన అవగాహన కల్పించి, నిరంతరం ప్రోత్సహించిన గైడ్ టీచర్లు టి. సతీష్, ఎం.ఎ. అంజుమ్ సుల్తానాలను ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. గైడ్ టీచర్లు అందించిన విలువైన సమాచారం, మెళకువలే ఈ రికార్డు స్థాయి గుర్తింపునకు పునాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరులో త్రుటిలో తప్పిన భారీ బస్సు ప్రమాదం

● లారీ డ్రైవర్ సమయస్ఫూర్తితో బతికిన 50 మంది విద్యార్థుల ప్రాణాలు




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూరు ప్రతినిధి (సాంబ పస్తం),ఆగస్టు22:** స్కూలు బస్సు డ్రైవర్ల తీవ్ర నిర్లక్ష్యం, అతివేగం విద్యార్థుల ప్రాణాల మీదకు తెచ్చిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఏకంగా 50 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడగా, వరుస ప్రమాదాలతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల తీరుపై తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. **అసలేం జరిగిందంటే:**మడూరు నుంచి సెయింట్ పాల్స్ పాఠశాలకు చెందిన బస్సు దాదాపు 50 మంది విద్యార్థులతో ఉదయం 8.30 గంటల సమయంలో బయలుదేరింది. పాఠశాల సమీపానికి చేరుకోగానే వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఓ లారీని ఓవర్ టేక్ చేసేందుకు బస్సు డ్రైవర్ ప్రయత్నించాడు. బస్సులో చిన్నారులు ఉన్నారనే విషయాన్ని కనీసం గుర్తుంచుకోకుండా తీవ్ర నిర్లక్ష్యంతో, అతివేగంతో ఓవర్ టేక్ చేయబోగా అకస్మాత్తుగా బ్రేకులు పడలేదు. ఎదురుగా వస్తున్న బస్సు నేరుగా తమ లారీని ఢీకొట్టబోతోందని గ్రహించిన లారీ డ్రైవర్, చురుగ్గా వ్యవహరించి సమయస్ఫూర్తితో తన వాహనాన్ని పూర్తిగా రోడ్డు ఎడమవైపునకు కిందకు దించేశాడు. దీంతో భారీ ప్రమాదం త్రుటిలో తప్పి, 50 మంది చిన్నారుల ప్రాణాలు నిలిచాయి. చిన్నారులను కాపాడిన లారీ డ్రైవర్ సమయస్ఫూర్తికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల మండిపాటు తొర్రూరు పరిధిలో వరుసగా రెండో రోజు కూడా పాఠశాల బస్సు ప్రమాదానికి గురవ్వడం స్థానికంగా తీవ్ర భయాందోళనలను రేకెత్తించింది. ప్రైవేటు స్కూళ్ల బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించకపోయినా, ఫిట్‌నెస్ లేని వాహనాలు నడుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. **పట్టించుకోని విద్యాశాఖ:** ఇంత పెద్ద ప్రమాదం జరిగినా ఘటనపై మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కనీసం స్పందించకపోవడం, విలేకరులకు సమాచారం ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. **చర్యలు శూన్యం:** ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసి, ఆ తర్వాత చేతులు దులుపుకోవడం అధికారులకు అలవాటుగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పెద్ద అవాంఛనీయ ఘటన జరిగితే తప్ప స్పందించరా అని ప్రశ్నిస్తున్న ప్రజలు, వెంటనే రవాణా (ఆర్టిఎ), విద్యాశాఖ అధికారులు స్పందించి సదరు పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫిట్‌నెస్ లేని బస్సులపై తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.




## విలీనం వద్దు... అభివృద్ధి వద్దు

### ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
### షాద్ నగర్ చౌరస్తా నుండి ఆర్డీఓ వరకు నిరసన ర్యాలీ
### పాలిటెక్నిక్ విలీనంపై షాద్‌నగర్‌లో విద్యార్థుల ఆందోళన
### విలీనం వద్దు.. ఫీజుల భారం మోపొద్దు!

**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు22:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తియంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జీఓఎంఎస్ నెం.97ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ షాద్‌నగర్‌లో ఎస్ఎఫ్ఐ,ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.షాద్‌నగర్ చౌరస్తా నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. "విలీనం వద్దు.. పాలిటెక్నిక్ విద్యకు స్వతంత్రత కావాలి", "పేద విద్యార్థులపై ఫీజుల భారం మోపొద్దు" అంటూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను పీపీపీ విధానంలో కొనసాగుతున్న యూనివర్సిటీ పరిధిలోకి తీసుకెళ్లడం వల్ల భవిష్యత్‌లో విద్యార్థులపై అధిక ఫీజుల భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.







ముఖ్యంగా గ్రామీణ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.పాలిటెక్నిక్ విద్యను ప్రత్యేక సాంకేతిక విద్యా వ్యవస్థగా కొనసాగిస్తూ దాని స్వతంత్రతను కాపాడాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా, సరైన మౌలిక వసతులు కల్పించకుండా విలీనం పేరుతో కొత్త విధానాలను తీసుకురావడం సరికాదన్నారు.కళాశాలల్లో ఆధునిక ల్యాబ్‌లు, అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు అధ్యాపక పోస్టులను భర్తీ చేసి విద్యా ప్రమాణాలను పెంచాలని కోరారు. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలపై ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించిన తర్వాతే పాలిటెక్నిక్ విద్యపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. జీఓఎంఎస్ నెం.97ను వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.షాద్‌నగర్‌లో జరిగిన ఈ ర్యాలీతో పాలిటెక్నిక్ విద్యపై ప్రభుత్వ నిర్ణయం మరోసారి చర్చనీయాంశంగా మారింది. విలీనం కంటే ముందుగా ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేసి, పేద విద్యార్థులకు అందుబాటులో ఉన్న సాంకేతిక విద్యను మరింత మెరుగుపరచాలని విద్యార్థులు కోరుతున్నారు.




చిరు పుట్టిన రోజు కానుక.

# మెగా అభిమానులకు 'కాకా' ట్రీట్!

మెగాస్టార్ చిరంజీవి తన పుట్టినరోజు (ఆగస్ట్ 22) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చారు. ఆయన కథానాయకుడిగా, టాలెంటెడ్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో రూపొందుతున్న 'మెగా 158' చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'కాకా' అనే పేరును ఖరారు చేస్తూ, ఒక పవర్‌ఫుల్ టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ ప్రకటనతో మెగా అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి.ఈ చిత్రంలో చిరంజీవి 'సత్యం' అనే మధ్యతరగతి వ్యక్తి పాత్రలో కనిపించనున్నారు. అయితే, టైటిల్ గ్లింప్స్‌లో ఆయనను యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో, గన్స్ పేలుస్తూ మాస్ అవతార్‌లో చూపించారు. దీంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రాన్ని 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. గతంలో 'వాల్తేరు వీరయ్య'తో సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించిన ఈ కాంబినేషన్, మరోసారి అదే పండగకు రానుండటం విశేషం.'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి-బాబీ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'కాకా'పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ స్టంట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో చిత్రీకరించిన ఒక భారీ ఫైట్ ఎపిసోడ్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. ఈ యాక్షన్ సన్నివేశాల్లో చిరంజీవి ఎంతో అంకితభావంతో, డూప్ లేకుండా రిస్కీ స్టంట్స్ చేశారని తెలుస్తోంది. మునుపెన్నడూ చూడని రీతిలో చిరంజీవి ఈ ఫైట్‌లో కనిపిస్తారని టాక్.ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ చిత్రాలు నిర్మిస్తున్న ఈ సంస్థకు తెలుగులో ఇదే తొలి సినిమా. ఈ సినిమాలో నివేదా పేతురాజ్, మలయాళ నటి అనశ్వర రాజన్ కీలక పాత్రలు పోషిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు.




# రవితేజ 'ఇరుముడి' జోరు.. అదనపు స్క్రీన్లు, షోలు

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుండటంతో, తెలుగు రాష్ట్రాల్లో అదనపు షోలను, మరిన్ని థియేటర్లను జోడిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేకర్స్ తెలిపారు.ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ మంచి వసూళ్లను సాధిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొత్త థియేటర్లను జోడించడంతో పాటు, ఉన్న థియేటర్లలోనూ అదనపు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది.'రవన్న బాక్సాఫీస్ దండయాత్ర' కొనసాగుతోందని చిత్రబృందం ప్రచార చిత్రాల ద్వారా పేర్కొంటోంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం అదనపు ఆకర్షణగా నిలిచింది. టీ-సిరీస్ ఫిలిమ్స్ సమర్పణలో విడుదలైన 'ఇరుముడి', రవితేజ అభిమానులను, మాస్ సినీ ప్రియులను అలరిస్తూ థియేటర్లలో విజయవంతంగా తన ప్రదర్శనను కొనసాగిస్తోంది.

# 'అల బొలెలో' సాంగ్ పూర్ణ స్టెప్పులు అదుర్స్!

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా, చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమా నుంచి తొలి పాట 'అల బొలెలో'ను శుక్రవారం విడుదల చేసి అభిమానులకు పండగలాంటి వార్త చెప్పింది.

యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ ఫుట్ ట్యాపింగ్ నంబర్‌ను ఆయనే స్వయంగా ఆలపించడం విశేషం. దర్శకుడు అరుణ్‌రాజా కామరాజ్ దీనికి సాహిత్యం అందించారు. అయితే, ఈ పాటలో సంగీతం, సాహిత్యం కంటే ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సమకూర్చిన స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా నటి పూర్ణ (షామ్నా కాసిం) తన అద్భుతమైన డ్యాన్స్‌తో, హావభావాలతో ఎంతగానో ఆకట్టుకున్నారు. ఆమె డ్యాన్స్ పాటకు ప్రత్యేక కళను తెచ్చిపెట్టింది.ఈ చిత్రంలో భాగం కావడంపై నటి పూర్ణ ఇటీవల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ""జైలర్ 2' లాంటి భారీ చిత్రంలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఇది ఒక కల నిజమైనట్లుంది" అంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు రజినీకాంత్, దర్శకుడు నెల్సన్, అనిరుధ్, జానీ మాస్టర్‌తో పాటు చిత్ర బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.కాగా, ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. గతంలో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ టీజర్‌లో నటుడు వినాయకన్ చెప్పిన డైలాగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. "నన్ను చంపి నువ్వు ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్!" అంటూ ఆయన చెప్పే డైలాగ్, ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్ ఎంట్రీ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.




# 'స్పిరిట్' వివాదం.. ఒక్క 'లైక్'తో వంగా బ్రదర్స్‌కు దీపిక పదుకొణె స్ట్రాంగ్ రిప్లై

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం 'స్పిరిట్' చుట్టూ అలుముకున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంపై నిర్మాత, సందీప్ రెడ్డి సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా చేసిన ఆరోపణలకు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకొణె పరోక్షంగా, కానీ చాలా బలంగా స్పందించారు. వంగా సోదరులను విమర్శిస్తూ రాసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను 'లైక్' చేయడం ద్వారా ఆమె తన వైఖరిని స్పష్టం చేశారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ.. దీపిక ఈ సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడిగారని, డేట్స్ సర్దుబాటు చేయలేకపోయారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా చర్చలు విఫలమయ్యాక సినిమా కథ, పాత్రకు సంబంధించిన అంతర్గత విషయాలను ఆమె లీక్ చేశారని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్థికంగా తమకు వర్కవుట్ కాకపోవడం వల్లే ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించాల్సి వచ్చిందని వివరించారు.ఈ ఆరోపణలపై దీపిక నేరుగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ, ఓ జర్నలిస్ట్ పెట్టిన పోస్ట్‌కు ఆమె మద్దతు తెలిపారు. "దీపిక 10% లాభం అడిగితే, మొత్తం వంగా ఆస్తిని అడిగినట్టు ఎందుకు ఫీల్ అవుతున్నారు? ఇది స్పష్టంగా మగ అహంకార సంక్షోభం. ఒక మహిళ 'నో' చెప్పడాన్ని వీరు జీర్ణించుకోలేకపోతున్నారు" అని ఆ పోస్ట్‌లో జర్నలిస్ట్ పేర్కొన్నారు.ఏళ్ల తరబడి మగ స్టార్లు లాభాల్లో వాటాలు, అనుకూలమైన పని గంటలు వంటివి డిమాండ్ చేస్తున్నారని, అలా చేస్తే వారిని 'క్రమశిక్షణ' గలవారని అంటారని, అదే ఒక మహిళా స్టార్ అడిగితే 'ఇబ్బంది పెట్టే వ్యక్తి'గా ముద్ర వేస్తారని ఆ పోస్ట్ విమర్శించారు. ఒప్పందం రద్దయి నెలలు గడుస్తున్నా వంగా సోదరులు ఇంకా ఆమె గురించే మాట్లాడటం వృత్తి నైపుణ్యం కాదని, ఇది పూర్తిగా లింగ వివక్ష, మగ అహంకారమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. "ఆమె నో చెప్పింది. దాన్ని అంగీకరించి ముందుకు సాగండి" అంటూ పోస్ట్‌లో జర్నలిస్ట్ రాసుకొచ్చారు. మొత్తానికి దీపిక నేరుగా స్పందించకపోయినా తన మద్దతు ద్వారా ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు. కేవలం రెమ్యూనరేషన్, డేట్స్ సమస్యగా మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు ఇండస్ట్రీలో లింగ సమానత్వం, మగ అహంకారంపై తీవ్ర చర్చకు దారితీసింది.



# ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్' ట్యాగ్‌పై ప్రభాస్ రియాక్షన్

భారతీయ సినీ పరిశ్రమలో -బాహుబలి- చిత్రంతో పాన్-ఇండియా సంస్కృతికి శ్రీకారం చుట్టిన ప్రభాస్ తన ఇమేజ్‌కు ఏమాత్రం గర్వం ఆపాదించుకోని అరుదైన వ్యక్తిత్వంతో కనిపిస్తారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -స్పిరిట్-లో ప్రభాస్ పేరు ముందు -ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్- అని వేయబోతున్నారనే వార్త అప్పట్లో సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ భారీ ట్యాగ్‌ను ప్రభాస్ ఎలా స్వీకరించారనే దానిపై నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా స్పందిస్తూ.. ప్రభాస్ గారి స్వభావానికి అద్దం పట్టే పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.సాధారణంగా నటులు తమ బిరుదులు, ప్రచార ట్యాగ్‌ల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అయితే ప్రభాస్ విషయంలో ఈ ప్రకటన ఎలా జరిగింది అన్న ప్రశ్నపై నిర్మాత వివరణ ఇస్తూ... టైటిల్ ఆవిష్కరణకు ముందే ఈ అంశాన్ని ఆయనతో ప్రస్తావించినట్లు తెలిపారు. దీనికి ప్రభాస్ ఎంతో క్యాజువల్‌గా తన సహజ సిద్ధమైన శైలిలో -మీ ఇష్టం డార్లింగ్- అంటూ ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా అంగీకారం తెలిపారట. ఈ ఒక్క చిన్న సమాధానం ప్రభాస్ నిరాడంబరతను, మేకర్స్‌పై ఆయనకు ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తోంది.ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న ప్రభాస్ షూటింగ్ షెడ్యూళ్ల సర్దుబాటులో ఎంతో ఫ్లెక్సిబుల్‌గా వ్యవహరిస్తున్నారని నిర్మాత ప్రణయ్ వంగా పేర్కొన్నారు. ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న -ఫౌజీ- చిత్రం పూర్తయిన వెంటనే.. ఆయన పూర్తి స్థాయిలో -స్పిరిట్- సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు. రెండు భిన్నమైన మేకింగ్ శైలులు కలిగిన సినిమాల మధ్య ఎంతో నైపుణ్యంతో సమన్వయం పాటిస్తూ.. ప్రభాస్ డేట్లను కేటాయిస్తున్నారని ప్రణయ్ రెడ్డి వంగా కొనియాడారు.



# సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

తమిళ చిత్ర పరిశ్రమలో మరోసారి సంక్షోభం నెలకొంది. ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో, 2026 సెప్టెంబర్ 1 నుంచి కొత్త సినిమాల విడుదలను నిలిపివేయాలని తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) కీలక నిర్ణయం తీసుకుంది.ఈ వివాదానికి ప్రధాన కారణం.. థియేటర్లలో విడుదలైన సినిమాలను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ చేసే కాలపరిమితి. సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలోకి రావాలని థియేటర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సినిమాలు త్వరగా ఓటీటీలో అందుబాటులోకి రావడం వల్ల ప్రేక్షకులు థియేటర్లకు రావడం తగ్గుతోందని, తద్వారా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిర్మాతలు మాత్రం తమ వాణిజ్యపరమైన వెసులుబాటును కోరుకుంటున్నారు. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు కొత్త సినిమాలను విడుదల చేయకూడదని నిర్మాతల మండలి స్పష్టం చేసింది. అయితే, ఇది పూర్తిస్థాయి బంద్ కాదని, సినిమా షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, తమిళనాడు థియేటర్ యజమానుల సంఘం ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం సెప్టెంబర్ నెలతో పాటు ఆ తర్వాత విడుదల కావాల్సిన పలు చిత్రాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

